క్లుప్తంగా

రైతుసేవ కేంద్రంలో రికార్డుల తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న ఏఓ స్వప్న

కౌడిపల్లి(నర్సాపూర్): ఎరువుల డీలర్లు బిల్ బుక్స్, స్టాక్ రిజిస్టర్ సర్టిఫై చేయించుకోవాలని ఏఓ స్వప్న అన్నారు. మంగళవారం మండల కేంద్రం కౌడిపల్లిలోని ఆగ్రోస్ రైతుసేవ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ పరిశీలించడంతో పాటు బిల్‌బుక్, రిజిస్టర్ తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతీ డీలర్ తప్పనిసరిగా బిల్‌బుక్, స్టాక్ రిజిస్టర్ సర్టిఫై చేయించాలన్నారు. ఎరువులు, విత్తనాలు స్టాక్‌తోపాటు ధరల పట్టికను రైతులకు కనిపించేలా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రాజశేఖర్‌గౌడ్, డీలర్ వెంకటేశం పాల్గొన్నారు.

జగదీశ్వరాచారి సేవలు అభినందనీయం



ఎంపీడీఓ దంపతులను సన్మానిస్తున్న ఎంపీపీ స్వరూపరెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి ఎంపీడీఓ జగదీశ్వరాచారి మంగళవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ స్వరూపరెడ్డి, జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్, ఉమ్మడి మండలంలోని ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొని జగదీశ్వరాచారి దంపతులను సత్కరించి మెమొంటోలు అందజేశారు.

మదూర్‌లో వైద్య శిబిరం



మదూర్‌లో పరిసరాలు పరిశీలిస్తున్న జిల్లా మలేరియా వైద్యాధికారి విజేందర్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మదూర్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వైద్య శిబిరం నిర్వహించారు. మంగళవారం మదూర్ గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న వారికి వైద్యం అందించడంతో పాటు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా వైద్యాధికారి విజేందర్ గ్రామంలో పర్యటించి పారిశుధ్య పనులు పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి సింధు, ఎంపీడీఓ దామోదర్, పల్లె దవాఖానా డాక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.


కార్యకర్తలను పట్టించుకోని కాంగ్రెస్ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ పార్టీ అధికారం లేని సమయంలో పార్టీ జెండాలను మోసి, అవమానాలు పొంది, జైలు పాలై ఎన్నో అవమానాలు పొందిన అసలు కష్టపడే కార్యకర్తలను పట్టించుకోవడం లేదని నార్సింగి మండల ఫిషర్ మెన్ అధ్యక్షుడు సుధాకర్ ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. నార్సింగి మండల కాంగ్రెస్ నాయకులు క్యాడర్ను కలుపుకొని పోవడం లేదన్నారు.

విద్యార్థులు 2 లోపు పరీక్షా ఫీజు చెల్లించాలి

టేక్మాల్(మెదక్): ఇంటర్‌లో ఫెయిలైన ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు సప్లమెంటరీ పరీక్ష రాసేందుకు ఈనెల 2లోపు పరీక్షా ఫీజు చెల్లించాలని టేక్మాల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుభాష్ చంద్ర మంగళవారం తెలిపారు. సకాలంలో ఫీజు చెల్లించి పరీక్షలు రాయాలని సూచించారు.

మొబైల్ స్టోర్ ప్రారంభం



స్టోర్‌ను ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు

తూప్రాన్: పట్టణం దినదినం అభివృద్ధి చెందుతున్న తరుణంలో నూతనంగా సెల్‌బే మొబైల్ స్టోర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీవో జనరల్ మేనేజర్ అతీష్‌భార్గవ్, ఎక్స్‌ఎంఐ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల ప్రతినిధి అన్వర్, సెల్‌బే వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ నాగరాజు సుహాస్, వైస్ ప్రెసిడెంట్ కృష్ణ ప్రసాద్ మొబైల్ స్టోర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆ సంస్థ పీఆర్‌ఓ గోపి తదితరులు పాల్గొన్నారు.

సర్కార్‌బడిలో విజయకేతనం

- పదిలో వందశాతం ఉత్తీర్ణత
- 10 జీపీఏ సాధించిన విద్యార్థులు
- అభినందించిన విద్యా శాఖ అధికారులు



సాత్విక (10 జీపీఏ)



జయశ్రీ (10 జీపీఏ)



కార్తీక (10 జీపీఏ)



శిరీష (10 జీపీఏ)



నందిని(10 జీపీఏ)



కీర్తన (10 జీపీఏ)



స్నేహ (10 జీపీఏ)

కౌడిపల్లిలో వందశాతం ఉత్తీర్ణత

కౌడిపల్లి(నర్సాపూర్): పదో తరగతి ఫలితాల్లో నాలుగు పాఠశాలలో వందశాతం ఫలితాలు సాధించారు. కౌడిపల్లి మండలంలో పది ఉన్నత పాఠశాలలు, మూడు గురుకుల పాఠశాలలున్నాయి. మొత్తం 586 మంది విద్యార్థులకు 556మంది పాస్ అయి 97శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో రాయిలాపూర్, భుజిరంపేట, తునికి, కౌడిపల్లి ఎంజేపీ గురుకుల పాఠశాలలు వందశాతం ఫలితాలు సాధించాయి. సలాబత్‌పూర్ 85శాతం, కౌడిపల్లి 90శాతం, వెల్మకన్న 97శాతం, ముట్రాజ్‌పల్లి 95 శాతం, కంచన్‌పల్లి 92 శాతం, కౌడిపల్లి బాలికల పాఠశాల 83 శాతం, కన్నారం 89.6 శాతం, ఎంజేపీ తునికి 97శాతం, ఎస్టీ గురుకులం 97శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంజేపీ తునికి, కౌడిపల్లి గురుకులానికి చెందిన భరత్‌తేజ(9.8), వరప్రసాద్(9.8), నిఖిల్(9.8) జీపీఏ సాధించారు.

వెల్దుర్తిలో 97 శాతం ఉత్తీర్ణత

వెల్దుర్తి(తూప్రాన్): పదో తరగతి వార్షిక ఫలితాల్లో వెల్దుర్తి ఉమ్మడి మండల వ్యాప్తంగా 97 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ యాదగిరి పేర్కొన్నారు. ఉమ్మడి మండలంలో 375 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. వెల్దుర్తి ఉన్నత పాఠశాలకు చెందిన హనుమాద్రి జాహ్నవి, అభిలాష్, కుకునూర్ ఉన్నత పాఠశాలకు చెందిన లాస్య 9.7 జీపీఏ సాధించి మండల టాపర్‌లుగా నిలిచారన్నారు.

చిలప్‌చెడ్‌లో 97.3 శాతం ఉత్తీర్ణత

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలో పదో తరగతిలో 97.3 శాతం ఉత్తీర్ణత వచ్చిందని నోడల్ అధికారి విఠల్ అన్నారు. కేజీబీవీలతో కలిపి మొత్తంగా 182 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండల కేంద్రం చిలప్‌చెడ్, చండూర్, సోమక్కపేట్, గౌతాపూర్ పాఠశాలలతో పాటు చిట్కుల్ కేజీబీవీలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాయని, చిట్కుల్, ఫైజాబాద్ ఉన్నత పాఠశాలలో 94 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. మండలంలో ఏ ఒక్క విద్యార్థి 10 జీపీఏ సాధించలేదని, సోమక్కపేట్ ఉన్నత పాఠశాల విద్యార్థిని రాగిణి, ఫైజాబాద్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కీర్తిశ్రీ అత్యధికంగా 9.7 జీపీఏ సాధించారు.

అల్లాదుర్గంలో వంద శాతం ఉత్తీర్ణత

అల్లాదుర్గం(మెదక్): మండలంలో పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. మండల పరిధిలో చిల్వెర, గడిపెద్దాపూర్, ముస్లాపూర్, అల్లాదుర్గం బాలుర, అల్లాదుర్గం బాలికల జిల్లా పరిషత్ పాఠశాలలతో పాటు కేజీబీవీ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణులయ్యారు. ముస్లాపూర్ జెడ్పీ పాఠశాలకు చెందిన భానుప్రియ, మధులికలు 9.7 జీపీఏ, చరణ్‌కుమార్, స్వప్న, అల్లాదుర్గం బాలికల పాఠశాలకు చెందిన నక్షత్ర 9.5 జీపీఏ సాధించారు.

రేగోడ్‌లో 95శాతం ఉత్తీర్ణత

రేగోడ్(మెదక్): రేగోడ్ మండలంలో 95 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ బుచ్యానాయక్ మంగళవారం తెలిపారు. మోడల్ స్కూల్ విద్యార్థిని అభిలాష 9.8 జీపీఏతో మండల టాపర్‌గా నిలిచారు. రేగోడ్ ఉన్నత పాఠశాలలో 92శాతం, మోడల్ స్కూల్‌లో 98శాతం, గజ్వాడ పాఠశాలలో 80శాతం, కేజీబీవీలో 100శాతం, జగిర్యాల పాఠశాలలో 100శాతం, టి.లింగంపల్లి పాఠశాలలో 83శాతం పాసయ్యారని ఎంఈఓ పేర్కొన్నారు.

మండల టాపర్‌లుగా మోడల్ స్కూల్ విద్యార్థులే

మండల టాపర్‌లుగా ప్రతీ ఏటా మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టిస్తున్నారు. ఈసారి కూడా 9.8 జీపీఏతో అభిలాష, 9.7 జీపీఏతో స్నేహ, బగ్గేశ్, రసజ్ఞ, వైష్ణవి ఉత్తీర్ణత సాధించారు. టాపర్‌లుగా ఉత్తీర్ణత పొందిన విద్యార్థులను ఎంఈఓ బుచ్యానాయక్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.

టేక్మాల్ మోడల్ స్కూల్‌లో వందశాతం

టేక్మాల్(మెదక్): మండల కేంద్రం టేక్మాల్ మోడల్ స్కూల్ వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. టేక్మాల్ మండలంలో 7 ఉన్నత పాఠశాలల్లో, కేజీబీవీ, మోడల్ పాఠశాలల్లో 93.29శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ నీలకంఠం తెలిపారు.

కొల్చారంలో 96.78 శాతం ఉత్తీర్ణత

కొల్చారం(నర్సాపూర్): మండలంలో 96.78 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బాలికల ఉత్తీర్ణత 98.62 శాతం, బాలుర ఉత్తీర్ణత 94.23 శాతంగా నమోదైంది. మూడు పాఠశాలలైన చిన్నఘనాపూర్, పోతంశెట్టిపల్లి, టీఎస్ డబ్ల్యూఆర్‌ఈఎస్ 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. రంగంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎరుకల నందిని ఇంగ్లీష్ మీడియంలో 10 జీపీఏ సాధించింది.

శివ్వంపేటలో 93 శాతం ఉత్తీర్ణత

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలో పదవ తరగతి ఉత్తీర్ణత 93 శాతం నమోదైంది. గోమారం ఉన్నత పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు.

పదేళ్లుగా పదిలో శత శాతం

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని శేరిపల్లి జెడ్పీ పాఠశాలలో పదేళ్లుగా పదో తరగతి ఫలితాల్లో శత శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. శేరిపల్లి జెడ్పీ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. నార్సింగి జెడ్పీ పాఠశాలలో 84 మంది ఉత్తీర్ణత సాధించారు.

తూప్రాన్‌లో 88.7 శాతం ఉత్తీర్ణత

తూప్రాన్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 88.7 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ బుచ్యానాయక్ అన్నారు. మండలంలో 487 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన వినయశ్రీ 10 జీపీఏ సాధించింది. సోషల్ వెల్ఫేర్ పాఠశాలకు చెందిన సీహెచ్. జయశ్రీ, కార్తీక, వై.శిరీషలు 10 జీపీఏలు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ సద్గుణగ్రేసీ తెలిపారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలో 69.69 శాతం ఉత్తీర్ణత సాధించారు. మాడల్ స్కూల్ విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. మోడల్ స్కూల్ విద్యార్థిని సాత్విక 10 జీపీఏ సాధించారు.

మండలంలోని ఎనిమిది స్కూళ్లలో వంద శాతం

రామాయంపేట(మెదక్): మండలంలో ఐదు ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించారు. రాయిలాపూర్, అక్కన్నపేట, లక్ష్మాపూర్, మాడల్ స్కూల్, సోషల్ వేల్ఫేర్ స్కూళ్లలో వంద శాతం ఫలితాలు నమోదయ్యాయి. మండల పరిధిలో మొత్తం 767 మంది పరీక్షలు రాయగా, వీరిలో 353 మంది ఉత్తీర్ణులైనట్లు ఎంఈఓ నీలకంఠం తెలిపారు.

8 పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత

నిజాంపేట(మెదక్): మండల వ్యాప్తంగా 8 పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు.

పెద్దశంకరంపేటలో 90.4 శాతం ఉత్తీర్ణత

పెద్దశంకరంపేట(మెదక్): మండల వ్యాప్తంగా 90.4 శాతం ఉత్తీర్ణత సాధించారు.

చేగుంటలో 99.05 శాతం ఉత్తీర్ణత

చేగుంట(తూప్రాన్): మండలంలో నిప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 99.05 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఏడు పాఠశాలల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు.

పాపన్నపేట మండల టాపర్ వరలక్ష్మి

పాపన్నపేట(మెదక్): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పాపన్నపేట టాపర్‌గా కుర్తివాడ ఉన్నత పాఠశాల విద్యార్థిని వరలక్ష్మి నిలిచారు. మండలంలో మొత్తం 529 విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 502 మంది ఉత్తీర్ణత సాధించారు. కుర్తివాడ విద్యార్థిని వరలక్ష్మి 9.8 జీపీఏ సాధించారు. మొత్తం 11 ఉన్నత పాఠశాలలకు కుర్తివాడ, కొడుపాక, గాంధారిపల్లి, కేజీబీవీ పాఠశాలలు 100 శాతం ఫలితాలు సాధించినట్లు ఎంఇఓ నీలకంఠం తెలిపారు.

నర్సాపూర్ మండలంలో 84 శాతం ఉత్తీర్ణత

నర్సాపూర్ రూరల్: మండలంలోని 19 ప్రభుత్వ పాఠశాలలో మొత్తం 852 మంది విద్యార్థులకు 719 మంది ఉత్తీర్ణులయ్యారు. మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ పాఠశాలకు చెందిన ఇద్దరు అమ్మాయిలు కీర్తన, స్నేహ 10 జీపీఏ సాధించారు. రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ పాఠశాల, గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించారు.

పది ఫలితాల్లో వెనుకబడిన మనోహరాబాద్

మనోహరాబాద్(తూప్రాన్): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈసారి వెనుకబడ్డారు. మండలంలోని కస్తూర్బా, 7 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కాళ్లకల్ ఉన్నత పాఠశాల 96 శాతంతో అత్యధికంగా, రామాయపల్లి ఉన్నత పాఠశాలలో 29 శాతంతో కనిష్ట స్థాయిలో ఫలితాలు వచ్చాయి. మిగతా పాఠశాలలో సగం శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. కస్తూర్బాలో 36 మందికి 34 ఉత్తీర్ణత సాధించారు. కాళ్లకల్‌లో 76 మందికి 72 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. కూచారంలో 19 మందికి 15 మంది, 73 శాతం, మనోహరాబాద్ 58 మందికి 41 మంది, రంగాయపల్లిలో 49 మందికి 30 మంది, పర్కిబండలో 16 మందికి 5గురు, రామాయపల్లిలో 24 మందికి 7మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. దీంతో మండలం మొత్తం 306 మందికి 229 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించడంతో మండలంలో 74 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం తగ్గడంతో ఉపాధ్యాయుల బోధన తీరుపై పలువురు ఆందోళన వ్యక్తం చేశారు.

డంపుయార్డ్‌లో చెలరేగిన మంటలు



డంప్‌యార్డ్ ప్రాంతంలో ఎగిసి పడుతున్న మంటలు, పొగ

పట్టణమంతా వ్యాపించిన పొగ

మెదక్ మున్సిపాలిటీ: మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డంపుయార్డ్‌లో మంగళవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో మంటలు ఎగిసి పడుతున్నాయి. 3.4 ఎకరాల విస్తీర్ణంలో పోగు చేసిన చెత్త, వ్యర్థాలకు నిప్పు అంటుకోవడంతో మంటలతో పాటు దట్టమైన పొగ పరిసరాల్లో వ్యాపిస్తుంది. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ జానకీరాం సాగర్ అక్కడికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా మూడు జేసీబీలతో చర్యలు చేపడుతున్నారు. ఎండల తీవ్రత కారణంగా ఒక్కసారిగా మంటలు ఎగిసి పడినట్లు కమిషనర్ తెలిపారు. అగ్ని మాపక సిబ్బందికి ఫోన్ చేయగా, ప్రధాని మోదీ సభ సమావేశానికి తరలి వెళ్లినట్లు తెలిసింది. దీంతో చేసేది లేక మున్సిపల్‌కు సంబంధించిన వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని తీసుకొచ్చి మంటలు ఆర్పే పనులు చేపట్టారు.

అధికారుల నిర్లక్ష్యంతో మంటలు

మంటలు చెలరేగిన వెంటనే అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టి ఉంటే సమస్య ఇంత తీవ్రంగా ఉండేది కాదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మంటలను ఆర్పడం, ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా చర్యలు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్య తీవ్రంగా మారింది.

హోం పోలింగ్

చేగుంట(తూప్రాన్): మండల పరిధిలోని పలు గ్రామాల్లో హోం పోలింగ్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ గియాసున్నీసాబేగం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో హోం ఓటింగ్ కోసం మండలంలోని 13 గ్రామాల్లో సీనియర్ సిటిజన్లు, అంగవైకల్యం ఉన్న 26 మందిని హోం ఓటింగ్ కోసం ఎంపిక చేశామని తెలిపారు. వీరందరికీ గురువారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు ఇంటింటికీ వెళ్లి ఓటింగ్ వేయించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

ఎదురెదురుగా వస్తున్న కారు, బైక్ ఢీ

- బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి



మల్లేశం(ఫైల్)

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎదురెదురుగా వస్తున్న కారు, బైక్ ఢీకొనడంతో, బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని చిట్కుల్ శివారులో మినీ బ్రిడ్జిపై మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్చారం మండలం సంగాయిపేట గ్రామానికి చెందిన పెద్ది మల్లేశం (45) మండలంలోని ఫైజాబాద్ గ్రామం నుంచి బైక్‌పై సంగాయిపేటకు వెళ్తుండగా, చిట్కుల్ గ్రామ శివారులోని మినీ బ్రిడ్జి వద్ద ఎదురుగా మెదక్ నుంచి జోగిపేటకు వస్తున్న ఈకోస్పోర్ట్ కారు ఢీకొనడంతో బైక్ పక్కనే ఉన్న పొలంలోకి దూసుకెళ్లింది. దీంతో మల్లేశంకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో బంధువులు వెంటనే అతన్ని జోగిపేట ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వాహన దారుడు కారును ఘటన స్థలంలోనే వదిలేసి వెళ్లిపోయాడు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోండి

ఎంపీపీ స్వరూపరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ స్వరూప

వెల్దుర్తి(తూప్రాన్): వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ స్వరూపరెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జగదీశ్వరాచారి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ బోనాలు



బోనాల ఊరేగింపులో భక్తులు

టేక్మాల్(మెదక్): మండలంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ 6వ వార్షికోత్సవాన్ని గౌడసంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అగరంగ వైభవంగా బోనాలను ఊరేగించి సమర్పించారు. శివసత్తుల నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గౌడ సంఘ సభ్యులు దుర్గాగౌడ్, అంజాగౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, విఠల్‌గౌడ్, సాయిబాబుగౌడ్, శంకర్‌గౌడ్, శ్యాంగౌడ్, అశోక్, విశ్వం, శ్రీనివాస్, రజినికాంత్ తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల బీఆర్‌ఎస్ పాలన అవినీతిమయం

టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి రామచందర్‌గౌడ్

రామాయంపేట(మెదక్): బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి అడుగంటిందని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి రామచందర్‌గౌడ్ ఆరోపించారు. ఆయన మంగళవారం రామాయంపేటలో అయన మాట్లాడుతూ.. ఈ పదేళ్లలో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుందని తెలిపారు. అన్ని రంగాల్లో అవినీతికి పాల్పడి రూ. వేలకోట్లు సంపాదించారన్నారు. ఎంపీ ఎన్నికల్లో ఓట్ల కోసం ప్రజల ముందుకు వస్తున్న బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పుతారని పేర్కొన్నారు. అభివృద్ధి సాధించాలంటే కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధును గెలిపించాలని కోరారు. పార్టీ ఓబీసీ సెల్ జిల్లా కన్వీనర్ విష్ణుకుమార్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్, మెదక్ నియోజకవర్గ సేవాదళ్ అధ్యక్షుడు జహీరుద్దీన్, కోనాపూర్ సహకార సంఘం డైరెక్టర్ సిద్ధరాంలు, ఎంపీటీసీ నాగులుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

గజ్వేల్: గజ్వేల్ పట్టణంలోని సీతారామ, ఉమామహేశ్వర ఆలయంలో మే 1 నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఆలయ కమిటీ మంగళవారం ఆహ్వాన పత్రికను అందజేసింది. కార్యక్రమంలో మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ విరాళం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గంగాయిపల్లి గ్రామంలోని దర్గా పునరుద్ధరణ కోసం జెడ్పీటీసీ మహేష్‌గుప్తా విరాళం అందజేశారు. మంగళవారం రూ.15 వేల నగదును నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పవన్‌గుప్తా, కుమార్, సదానందం, రాజు, హుసేన్, జాంగిర్ తదితరులు ఉన్నారు.

◆ కాంగ్రెస్‌లో చేరికలు

పెద్దశంకరంపేట(మెదక్): నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని రామోజిపల్లికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ ప్రభాకర్‌రావు మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. జహీరాబాద్ ఎంపీగా సురేష్‌షెట్కార్‌ను గెలిపించాలని వారికి ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సురేందర్‌రెడ్డి, నారాగౌడ్, మాజీ ఎంపీపీ రాజు, రాంచందర్, సంగమేశ్వర్, సుభాష్‌గౌడ్, అశోక్, రవి తదితరులు ఉన్నారు.


◆ ప్రజాశీర్వదంతో మూడోసారి అధికారం

మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు



వర్గల్(గజ్వేల్): సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ నినాదంతో పాలిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజాశీర్వదంతో మూడోసారి అధికారం చేపట్టబోతున్నారని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని నాచగిరి లక్ష్మీనృసింహస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి జిల్లా నాయకుడు నందన్‌గౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు బాల్‌రెడ్డి తదితర పార్టీ శ్రేణులతో కలిసి నాచారంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెద్దచెరువు వద్ద ఉపాధి హామీ పథకం కూలీలతో మాట్లాడారు. కమలం పువ్వు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంతో పోల్చితే ఉపాధి కూలీల దినసరి వేతనం చాలా తక్కువగా ఉండేదని ప్రధాని మోదీ ఇప్పుడు రూ.300లకు పెంచారన్నారు. పేదలకు ఉచితంగా ఆరు కిలోల రేషన్ బియ్యం ఇస్తున్న ఘనత నరేంద్ర మోదీదే అన్నారు. మెదక్ నుంచి కమలం పార్టీని గెలిపించి బహుమతిగా ఇవ్వాలన్నారు. ప్రచారంలో పార్టీ నాయకుడు టేకులపల్లి రాంరెడ్డి, ఎస్సీ మోర్చా నాయకులు స్వామి, రవీందర్ గౌడ్, రమేష్, యాదగిరి, రాజు, శ్రీనివాస్, మధు తదితరులున్నారు.

కోర్విపల్లిలో ఎండిపోయిన నర్సరీ



నిర్వహణ లోపంతో ఎండిన నర్సరీ మొక్కలు

చిన్నశంకరంపేట(మెదక్): పచ్చదనం పెంపొందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన హరిత నర్సరీని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మండలంలోని కోర్విపల్లి గ్రామంలో గ్రామ పంచాయితీ నర్సరీ నిర్వహణ గాలికి వదిలేశారు. గత ఏడాది బిల్లులు రాకపోవడంతో నిర్వాహకుడు బాధ్యతల నుంచి తప్పుకోగా గ్రామ పంచాయతీ నిర్వహణ బాధ్యతను తీసుకుంది. సరైన నిర్వహణ కొరవడి సుమారు 8000 మొక్కలు ఎండిపోయ్యాయి. నీరు పెట్టేందుకు అవసరమైన నీటి ట్యాంకర్లు ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో నర్సరీ మొక్కలు ఎండుముఖం పట్టాయి. అధికారులు స్పందించి నర్సరీలోని మొక్కలు కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వేధింపులకు అడ్డుకట్ట వేయండి



రామతీర్థం గ్రామంలో ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాపన్నపేట(మెదక్): మహిళలు, చిన్నపిల్లలపై వేధింపులకు వెంటనే అడ్డుకట్ట వేయాలని సఖి కేస్ వర్కర్ స్వప్న, పారా మెడికల్ లక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని రామతీర్థం గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలపై వరకట్న, లైంగిక, మానసిక వేధింపులు జరిగితే వెంటనే 181 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. బాల్య వివాహాలు, కుటుంబ సమస్యలు తదితర విషయాలకు 1098కి, సైబర్ నేరాలకు 1930కు ఫోన్ చేయాలని కోరారు.